ప్రజాశక్తి
ఆదివారం 31 మార్చి 2024 5
శ్రీ సత్యసాయి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నీటిఎద్దడి రానీయొద్దు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నీటి పథకాలన్నీ సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరణ్‌బాబు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం కలెక్టర్ తాగునీరు, ఉపాధి పనులపై డివిజన్‌లోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని ఇతర అవసరాలైన వాహనాలు, ఇంటి తోటలకు వాడరాదన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో చేతిపంపులకు మరమ్మతులు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్తవేతనం అమలు చేసేలా కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉపాధి కూలి రోజుకు రూ. 300కు పెరిగిన విషయాన్ని కూలీలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వెంకటనారాయణ, డ్వామా పీడీ విజయప్రసాద్, డివిజన్‌లోని ఎంపిడిఒలు, తహశీల్దార్లు, పాల్గొన్నారు.

అనంతలో 'మేమంతా సిద్ధం'

◆జగన్‌కు ఘనస్వాగతం పలికిన వైసిపి శ్రేణులు ◆వైసిపిలోకి ఉమామహేశ్వర నాయుడు చేరిక

మహిళలతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి



బస్సు నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తలపెట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర శనివారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. నాలుగో రోజు ఉదయం కర్నూలు జిల్లాలో తుగ్గలి ప్రారంభమైన యాత్ర సాయంత్రానికి అనంతపురం జిల్లాకు చేరుకుంది. గుత్తి మండలం బసినేపల్లి వద్ద జిల్లాలోకి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశించారు. సరిహద్దుల్లో వైసిపి ముఖ్య నాయకులు పెద్దఎత్తున ఆయన స్వాగతం పలికారు. అక్కడి నుంచి గుత్తి పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. పట్టణంలో దారి పొడవునా వైసిపి నాయకులు, అభిమానులు వైసిపి జెండాలను చేతబట్టుకుని ముఖ్యమంత్రికి మద్దతు పలికారు. అక్కడి నుంచి పామిడి, కల్లూరు, గార్లదిన్నె మీదుగా రాప్తాడు వరకు యాత్ర సాగింది. మొత్తం జాతీయ రహదారి 44పైనే ఈ యాత్ర సాగడంతో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం కలిగింది. యాత్రలో ఎక్కడా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడలేదు. కేవలం అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అక్కడక్కడ వృద్ధులు, మహిళలు, పిల్లలను పలకరిస్తూ ముందుకు కదిలారు.

మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా తిరిగి వైసిపి గూటికేనా ?

కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా తిరిగి వైసిపిలో చేరతారని జోరుగా ప్రచారం సాగుతోంది. 2014లో వైసిపి తరుపున పోటీ చేసి ఎమ్మెల్యేగా చాంద్‌బాషా గెలుపొందారు. తరువాత ఆయన వైసిపిని వీడి టిడిపిలో చేరారు. 2019 ఎన్నికల్లో టిడిపి టిక్కెట్టు ఆశించి భంగపడ్డారు. ఈసారి కూడా ఆయనకు కాకుండా కందికుంట వెంకట ప్రసాద్‌కే టిక్కెట్టును ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన టిడిపిని వీడి వైసిపిలో మళ్లీ చేరుతారని ప్రచారం నడుస్తోంది. అది కూడా మేమంతా సిద్ధం యాత్రలోనే ముఖ్యమంత్రి సమక్షంలో వైసిపిలో చేరే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

జగన్ సమక్షంలో వైసిపిలో చేరుతున్న మాదినేని ఉమామహేశ్వర నాయుడు

వైసిపిలోకి టిడిపి కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి మాదినేని ఉమా

ముఖ్యమంత్రి పర్యటన జిల్లాలోకి ప్రవేశించకముందే టిడిపికి షాక్ తగిలింది. కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న మాదినేని ఉమామహేశ్వర నాయుడు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. ఈ మేరకు ఆయన రాయలసీమ వైసిపి ఇన్‌ఛార్జీగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాప్తాడు తాజా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకర నారాయణ, కళ్యాణదుర్గం వైసిపి అభ్యర్థి తలారి రంగయ్యలతో కలసి తుగ్గలికి వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతోపాటు నియోజకవర్గంలోని ఇతర టిడిపి నాయకులు కూడా వైసిపిలో చేరారు.

ప్రజాసేవలోనూ భాగస్వామ్యం కావాలి: కలెక్టర్

కలెక్టర్‌కు పరికరాల పత్రాన్ని అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ రంగ సంస్థలు తమకు వచ్చే లాభాల్లో కొంత మొత్తం ప్రజాసేవకు వినియోగించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. శనివారం కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో కియో కంపెనీ అనుబంధ సంస్థ హైనోడా హయోబిస్ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంపెనీలు ఇచ్చే సిఎస్‌ఆర్ కార్యక్రమాలు విస్తతపరచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ అంగన్వాడీ కేంద్రాలకు ఉపయోగపడే రూ.44,13,436 విలువగల పరికరాలను కంపెనీ ప్రతినిధులు అందజేశారు. అనంతరం ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు ఏ వయసులో ఎంత బరువు ఉన్నారో తెలుసుకునే బరువు కొలమాన యంత్రాలు, పెద్దలు బరువు కొలిచే యంత్రాలు, స్టేడియో మీటర్ పరికరాలు అందజేశారాన్నరు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్యతో పాటు కంపెనీ ప్రతినిధులు హుస్ మిన్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..ఖాద్రీశుని రథోత్సవం..!

◆భక్తులతో నిండిపోయిన కదిరి తిరువీధులు
◆పలుచోట్ల అన్నదానం, మజ్జిగ పంపిణీ
◆పోలీసులు, అధికారుల పటిష్ట బందోబస్తుతో రథోత్సవం ప్రశాంతం

తిరుమాడవీధుల్లో కొనసాగుతున్న ఖాద్రీశుని రథోత్సవం

రథోత్సవంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీవారు

ప్రజాశక్తి-కదిరి టౌన్, కదిరి అర్బన్

కదిరి ఖాద్రీశుని రథోత్సవం కమనీయంగా జరిగింది. వేలాదిగా తరలొచ్చిన భక్తజనంతో కదిరి మాడవీధులు కిక్కిరిసిపోయాయి. పెద్ద సంఖ్యలో హాజరైన యువత రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. మల్లెలు, దవనం, మిరియాలు స్వామి వారిపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు. 11 రోజుల పాటు విశేష పూజలందుకున్న శ్రీభూదేవి సమేతుడైన నారసింహుడు రథంపై దేవేరులతో తిరుమాడవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన రథోత్సవ కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 12వ రోజు రథోత్సవాన్ని నేత్రపర్వంగా కొనసాగించారు. తేరుఉత్సవాన్ని చూసేందుకు ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు నుంచి లక్షలాది మంది తరలొచ్చారు. దీంతో కదిరి పట్టణం జనసంద్రంగా మారింది. మండుటెండను లెక్కజేయకుండా భక్తులు శ్రీవారి దర్శనానికి బారులుదీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అటు అధికార యంత్రాంగం, ఇటు దాతల సాయంతో అన్ని సౌకర్యాలనూ ఏర్పాటు చేశారు. రోడ్డు వెంబడి తాగునీరు, మజ్జిగ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. రథోత్సవం ప్రారంభం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఎవి.నరసింహాచార్యులు, పార్థసారథి చార్యులు రథం(తేరు)ముందు ఉదయం 7.45 గంటలకు రథహోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం శ్రీదేవి భూదేవి సమేతంగా వసంత వల్లభుడుని రథంపై కూర్చో బెట్టారు. 8-10గంటలకు రథం ముందుకు కదిలింది. 12-50 గంటలకు యథాస్థానానికి తేరు చేరుకొంది. తేరుపై మాజీ ఎమ్మెల్యే ఎంఎస్.పార్థసారథి, విష్ణువర్ధన్ రెడ్డి, వంశీకష్ణలు రథం గమనాన్ని భక్తులకు వివరిస్తూ సవ్యంగా ముందుకు సాగేలా సూచనలు ఇచ్చారు. రథం సులభంగా ముందుకు కదిలేందుకు గంగిరెడ్డిపల్లి, గజరెడ్డిపల్లి, మూర్తిపల్లి , కూటగుళ్ల, బేరిపల్లికి చెందిన స్వామి వారి కాపులు వెనకాల తెడ్లు వేస్తూ సహకరించారు. రథోత్సవంలో ప్రత్యేకంగా విక్రయించే కదిరి మల్లెలు, కుంకుమ, దవనంను భక్తులు కొనుగోలు చేశారు.

రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

లక్ష్మీ నరసింహస్వామిని బ్రహ్మరథోత్సవాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పార్థసారధిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వెండిదండి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బుల్ అహ్మద్, పూల శ్రీనివాసులు రెడ్డి తదితర ప్రముఖులు తేరు మోకులులాగి రథంను ప్రారంభించారు. ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సిఐలు, 15 మంది ఎస్ఐలు 300 మంది ప్రత్యేక బలగాలు,100 మంది హోంగార్డులు భద్రతా సిబ్బందిలో పాల్గొన్నారు. రథోత్సవంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అధికారులు, పోలీసు యంత్రాంగం తీసుకున్న అన్ని చర్యలూ మంచి ఫలితాలను ఇచ్చాయి. దీంతో రథోత్సవం ఆద్యంతం ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.

కూటమిలో 'పరిపూర్ణ'ంగా విభేదాలు..!

◆'పురం' స్థానంపై పట్టు వదలని పరిపూర్ణానందస్వామి
◆పార్లమెంట్, అసెంబ్లీ రెండు స్థానాల్లోనూ పోటీ చేస్తానంటూ ప్రకటన
◆కూటమికి పెద్ద షాక్‌నిస్తున్న స్వామీజీ

ప్రజాశక్తి-హిందూపురం

కూటమిలో సీట్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయ్యింది. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ స్థానాలకు ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో భాగంగా ధర్మవరం బిజెపికి కేటాయించగా, మిగిలిన రెండు పార్లమెంట్, 13 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి పోటీ చేయనుంది. హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి బరిలో దిగేందుకు కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ ఏడాది కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. బిజెపి, టిడిపి మధ్య పొత్తు కుదిరితే వారికి ఉన్న ఓటు బ్యాంకుతో గెలుపొందవచ్చు అని ఆశించారు. అందులో భాగంగానే పలుమార్లు ఆయన హిందూపురం పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. గత నెలలో తాను కూటమి అభ్యర్థిగా హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి బరిలో ఉంటానని ప్రకటన కూడా చేశారు. ప్రకటన అయితే చేశారు గానీ టికెట్‌ను తెచ్చుకోలేకపోయారు. ఈ స్థానాన్ని పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథికి కేటాయిస్తూ టిడిపి నిర్ణయం తీసుకుంది. పరిపూర్ణానంద పురం పార్లమెంట్ టికెట్ కోసం దేశరాజధాని స్థాయిలో బిజెపి పెద్దలతో మంతనాలు చేసినట్లు తెలుస్తోంది. పరిపూర్ణానందకు పార్లమెంట్ టికెట్టు ఇస్తే ఎంపీ సీటుతో పాటు దాని పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులపై ప్రభావం పడి ఓడిపోయే ప్రమాదం ఉందని టిడిపి నేతలు బిజెపి పెద్దలకు వివరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో చివరి వరకు ఎన్ని ప్రయత్నాలు చేసిన పరిపూర్ణానంద స్వామికి మాత్రం టికెట్టు దక్కలేదు.

పరిపూర్ణానంద రాజకీయంగా ఎదగాలన్న ఉద్దేశంతో గత కొన్ని నెలలుగా హిందూపురం పార్లమెంటు, అసెంబ్లీ కేంద్రంగా ప్రత్యేక దష్టి సారించారు. రాజకీయంగా ఎన్నికల్లో పోటీ చేయాలన్న సంకల్పంతో పలు కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. బిజెపి టికెట్‌పై పోటీ చేస్తానని కూడా ఆయన అనుయాయుల వద్ద పలుమార్లు తెలియజేశారు. రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమిగా ఏర్పడడంతో ఈ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బిజెపి నుంచి తానే పోటీలో ఉంటానని కూడా ప్రకటనలు చేస్తూ వచ్చారు. కూటమి ఈయన ఆశలపై నీళ్ళ చల్లి, టిడిపి అభ్యర్థిని ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా పరిపూర్ణానందస్వామి అయోమయంలో పడ్డారు. టికెట్ దక్కకపోవడంతో కూటమిపై ధిక్కార స్వరం విన్పిస్తున్నారు. టికెట్టు దక్కకపోవడంతో పరిపూర్ణానంద తనదైన శైలిలో టిడిపి, బిజెపి, జనసేనపై విమర్శలు ఎక్కుపెట్టారు. హిందూపురం పార్లమెంట్‌తో పాటు హిందూపురం అసెంబ్లీ రెండు స్థానాల్లోనూ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానంటూ ఆయన ప్రకటన చేశారు. తనకు టికెట్టు దక్కకుండా చేసిన టిడిపి కూటమి అభ్యర్థులను ఓడించి తీరుతానంటూ ప్రతినబూనారు. పరిపూర్ణానంద ప్రకటనతో ఒక్కసారిగా కూటమిలో కలవరం మొదలైంది. పరిపూర్ణానంద స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే కూటమి అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందా... అన్న లెక్కలను టిడిపి, బిజెపి నాయకులు వేసుకుంటున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే విషయంపై నేడు(ఆదివారం) పట్టణంలో తన సన్నితులతో సంప్రదింపులు జరిపేందుకు ఆత్మీయ సమావేశాన్ని పరిపూర్ణానంద ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. సమావేశం వివరాలను అయితే అధికారంగా ప్రకటించలేదు.

బిజెపి సహకారం అంతంతమాత్రమే..!

తన సిద్ధాంతాలు, బిజెపి సిద్ధాంతాలు ఒకటే అయిన నేపథ్యంలో తాను ఆ పార్టీ నుంచి పోటీ చేస్తానని ముందునుంచి పరిపూర్ణానంద చెబుతూ వస్తున్నారు. బిజెపి మాత్రం ఆయనకు టికెట్టు ఇవ్వకుండా చేయి ఇచ్చింది. ఇక స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకుల నుంచి సహకారం అంతంత మాత్రంగానే ఉండే పరిస్థితి హిందూపురంలో కన్పిస్తోంది. కేవలం ఒక వర్గం నాయకులు మాత్రమే ఆయనకు మద్దతుగా ఉంటున్నారు. ఈ మద్దతును కూడా వారు బహిరంగంగా ప్రకటించడం లేదు. ఒకవేళ ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే స్థానిక బిజెపి నేతల నుంచి ఎలాంటి సహకారం ఉంటుందనేది ప్రశ్నార్థకంగానే ఉంది. పరిపూర్ణానంద పోటీలో ఉంటే మాత్రం కూటమి ఓట్లకు గండిపడే అవకాశం ఉందనే భావనను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో కదిరి, హిందూపురం, ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ముస్లిం, మైనార్టీలు తనకు మద్దతుగా నిలుస్తారనే ధీమాను ఆయన వ్యక్తం చేస్తుండడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో హిందూపురం కూటమికి కొరకరాని కొయ్యగా మారిన పరిపూర్ణానందను బిజెపి అధిష్టానం ఏ మేరకు శాంతిపజేస్తుందన్నది వేచి చూడాల్సి ఉంది.

పట్టు రైతులకు బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం/మడకశిర

2019లో ప్రతిపక్షనేత హోదాలో పాదయాత్రలో చేసిన వాగ్దానం మేరకు సిఎం జగన్ పట్టు రైతుల సమస్యలు పరిష్కరించాకే వైసిపి ఓట్లు అడగాలని పట్టు రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు సోంకుమార్, ఆనందరెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పట్టు రైతులకు ఇచ్చిన హామీని సిఎం జగన్ విస్మరించారని.. పట్టు రైతుల బకాయిలను విడుదల చేయకుండా ఏ మొహం పెట్టకుని జిల్లాకు వస్తున్నారని హిందూపురం పట్టణంలో పట్టు రైతు సంఘం నాయకులు సిద్దారెడ్డి ప్రశ్నించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు పట్టు రైతులను మోసం చేశాడని మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పట్టు రైతులకు అందాల్సిన రూ. 4 కోట్ల బకాయిలు, కిలో బైవోల్టన్ పట్టు గూళ్లకు రూ. వంద ఇన్సెంటివ్ ఇస్తానని జగన్ హామీలిచ్చి రాష్ట్వవ్యాప్తంగా 10 లక్షల మంది పట్టు రైతులు, రీలర్లు, వీవర్ల ఓట్లు దండుకున్నారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గతంలో ఇవ్వాల్సిన రూ. 4 కోట్లతో పాటు నేటి వరకూ రూ. 60 కోట్లు చెల్లించకపోగా అన్ని రకాల సబ్సిడీలను నిలిపేశారని మండిపడ్డారు. వైసిపి జిల్లా అధ్యక్షులు నవీన్‌నిశ్చల్ కూడా ఈ విషయాన్ని సజ్జల రామ కృష్ణారెడ్డి ద్వారా సిఎం జగన్ దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదన్నారు. మళ్లీ ఇప్పుడు పట్టు రైతులను కోటీశ్వరులను చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. రూ. 60 కోట్ల బకాయిలు విడుదల చేసిన తర్వాతే వైసిపి ఓట్లు అడగాలని, లేనిచో గట్టిగా గుణపాఠం చెప్పడానికి పట్టు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు.

మడకశిరలో సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

సిఎం జగన్ విడిది కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి,

సిఎం జగన్ పర్యటన భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎన్నికల ప్రచారంలో భాగంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో జిల్లాలో నిర్వహిస్తున్న బస్సుయాత్రకు సంబంధించి బందోబస్తు, భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ మాధవరెడ్డి సమీక్షించారు. బత్తలపల్లిలో జగన్ విడిది కేంద్రం వద్ద ఏర్పాట్లను శనివారం ఎస్పీ పరిశీలించి అక్కడి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం పోలీస్ స్టేషన్ చేరుకుని పరిస్థితులపై సమీక్షించారు. రెండు రోజుల పాటు తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన చర్యలపై అడిషనల్ ఎస్పీ విష్ణుప్రసాద్, డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు. ఎస్ఐ శ్రీనివాసులుతో చర్చించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశారు. ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో కొనసాగే సిఎం జగన్ బస్సుయాత్రకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బస్సుయాత్రలో ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిద్ధం చేశామన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి

మండలంలోని సంజీవపురం సమీపంలో ఏర్పాటు చేసిన సిఎం జగన్ విడిది కేంద్రం వద్ద ఏర్పా ట్లను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, తదిత రులు పరిశీలించారు. వారితో పాటు గుర్రం శ్రీనివాస్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి ఉన్నారు.

మంటకలిసిన మానవత్వం

◆తల్లి అంత్యక్రియలకు దూరంగా కుమారులు
◆ఎస్ఐ, రెవెన్యూ అధికారుల చొరవతో దహనసంస్కారాలు పూర్తి

ఓబుళదేవరపల్లిలో గంగమ్మ ఇంటి వద్ద అంత్యక్రియలపై మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

నవమాసాలు మోసి, కని పెంచిన తల్లి చనిపోతే ఆమెకు అంత్యక్రియలు చేయాల్సిన కొడుకులు కాసుల కోసం కక్కుర్తి పడ్డారు. ఇంటి ముందరే తల్లి మృతదేహం వద్ద బేరాలాడుకున్నారు. ఒకరిమీద ఒకరు చెప్పుకుంటూ అంత్యక్రియలు చేయకుండా తలోదిక్కు వెళ్లిపోయారు. చివరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని కుమారుల చేత బలవంతంగా అంత్యక్రియలను పూర్తి చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. సభ్యసమాజం సిగ్గుపడేలా మంటకలిసిపోతున్న మానవత్వంకు నిదర్శనంగా ఈ ఘటన నిలిచింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... సోమందే పల్లి మండలం ఓబులదేవరపల్లిలో గ్రామానికి చెందిన గంగమ్మ(60) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మరణించింది. గతంలోనే ఈమె భర్త మరణించాడు. అప్పటి నుంచి ఒంటిరిగానే ఆమె ఉంటోంది. ఈమెకు ముగ్గురు కుమారులున్నారు. వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ వీరు జీవనం సాగిస్తున్నారు. గంగమ్మ మరణించడంతో స్థానికులు విషయాన్ని కుమారులకు తెలియజేశారు. అక్కడికి వచ్చిన కుమారులు తల్లి మృతదేహాన్ని ఇంట్లో పెట్టుకుని అంత్యక్రియల బాధ్యత నీదంటే నీదని ఒకరిపై ఒకరు వాదులాడుకున్నారు. గంగమ్మ వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బు, ఆస్తి కోసం వాగ్వాదం చేసుకున్నారు. చివరకు ఎవరూ అంత్యక్రియలు చేయకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంత్యక్రియలకు వచ్చిన బంధువులు, గ్రామస్తులు విషయం తెలుసుకుని కుమారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా వారి నుంచి స్పందన లేకపోవడంతో విషయాన్ని పోలీసుల దష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎస్ఐ విజయ్ కుమార్, విఆర్ఓ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ గ్రామంలోకి వెళ్లారు. వెంటనే కుమారులను అక్కడికి రప్పించి మాట్లాడారు. తల్లి అంత్యక్రియలను చేయాల్సిన బాధ్యత కుమారులదే అని, తక్షనం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పోలీసుల సమక్షంలో ఆమెకు అంత్యక్రియలను నిర్వహించారు.

బిల్లులు చెల్లించి ఆదుకోండి : గుత్తేదారులు

హిందూపురం : పురపాలక సంఘ కార్యాలయంలో అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అధికారుల నిర్లక్ష్యం వల్ల తామందరం రోడ్డున పడ్డామని, స్పందించి తమను ఆదుకోవాలంటూ శనివారం రాత్రి కమిషనర్ నివాసం వద్దకు వెళ్లి కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని గుత్తేదారులు వేడుకున్నారు. ఈ సందర్భంగా గుత్తేదారులు మాట్లాడుతూ పురపాలక సంఘవ్యాప్తంగా గత 8 నెలల కాలంగా చేసిన అభివద్ధి పనులకు బిల్లులను సకాలంలో సిఎఫ్‌ఎంఎస్‌లో ఎక్కించకపోవడంతో దాదాపు రూ.2కోట్ల బిల్లులు నిలిచి పోయాయన్నారు. తమకు బిల్లులు మంజూరు చేయకపోతే ఇకపై అభివృద్ధి పనులు చేపట్టలేమని తెగేసి చెప్పారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అకౌంట్స్ విభాగం, ఫ్రీ ఆడిట్ అధికారులపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. సకాలంలో బిల్లులు పడేవిధంగా చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఎపిని మాదకద్రవ్యాల అడ్డాగా మార్చిన వైసిపి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

వైసిపి ప్రభుత్వం ఎపిని మత్తుమందు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డగా మార్చారని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. పల్లె శనివారం మండలంలోని మీర్జాపురం పంచాయతీలో నిర్వహించిన జయహో బిసి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు ప్రజలు పల్లెపై పూల వర్షం కురిపించి అపూర్వ స్వాగతం పలికారు. పల్లె మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా యథేచ్ఛగా మట్టి, ఇసుక, గ్రానైట్, ఖనిజ దోపిడీ సాగించారన్నారు. పుట్టపర్తిలో ఎమ్మెల్యే అభివృద్ధిని విస్మరించి దోపిడీ, భూదందాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. టిడిపి మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థి పల్లె సింధూరరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బంగారు చిన్నేపల్లి, పాత, కొత్త దేవరపల్లి, గొంగిటివారిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సామకోటి ఆదినారాయణ, సాలక్కగారి శ్రీనివాసులు, కన్వీనర్లు రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు, బండ్లపల్లి కిష్టప్ప, గోపాల్‌రెడ్డి, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటిసి లక్ష్మీనారాయణ, సుధాకర్, సురేష్, యుదు, వెంకటరెడ్డి, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, లోకనాథ్‌నాయుడు, కొడవగానిపల్లి శివ, హర్ష, కిరణ్, షఫీ, రాధ, మాధవి, మని, లత, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార రథంపై మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

వైభవంగా భూతప్పల ఉత్సవం

ప్రజాశక్తి-మడకశిర/రొళ్ల

రొళ్లలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం భూతప్పల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆంధ్ర, కర్నాటక, తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజామునే మారుతికాలనీ సమీపంలోని ముత్తరాయస్వామి ఆలయంలో భూతప్పలు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళ తాళాల మధ్య పాదాలబండ వద్దకు వచ్చి అక్కడి నుంచి నృత్యం చేసుకుంటూ బయల్దేరారు. అంతకుముందే భక్తులు మడి స్నానమాచరించి తడి దుస్తులతోనే భూతప్పల కాలి స్పర్శ కోసం వారు వచ్చే మార్గంలో కిలోమీటర్ల మేర మొక్కుబడిగా బోర్లా పడుకున్నారు. వారి మీదుగా భూతప్పలు నడుచుకుంటూ వెళ్లారు. ఇలా చేయడం వల్ల దీర్ఘకాలిక సమస్యలు తొలగుతాయని, సంతాన భాగ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకున్న భూతప్పలకు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఆంజనేయస్వామి ఆలయం చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భూతప్పలు బొరుగుల రాశిలో బొరుగులు భుజించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో వెలసిన భూతప్పల ఆలయం వద్దకు చేరుకొని ఆలయంలో భూతప్పలను కూర్చోబెట్టారు. పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, నీడ, విద్యుత్, తదితర సౌకర్యాలు కల్పించారు. వైసిపి సోషల్ మీడియా కో కన్వీనర్ ఆనంద్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, రాష్ట్ర కుంచిటి ఒక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్.నరసింహగౌడ్, డైరెక్టర్ లక్ష్మీపతి, సర్పంచి లక్ష్మమ్మ, వైస్ ఎంపిపి నాగరాజు, వైస్ సర్పంచి రాజు, నాయకులు లోకేష్, మధు, నాగేంద్ర, తిప్పేమల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

భూతప్పల కాలి స్పర్శ కోసం పడుకున్న భక్తులు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

రొద్దం : మండలంలోని తాడంగపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం శివమ్మ(24) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. వారు నూతనంగా నిర్మిస్తున్న గృహంపై నీరు పెడుతుండగా పైన వెళ్తున్న విద్యుత్ తీగలను గమనించకపోవడంతో అవి తగలడంతో షాక్‌కు గురై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి చెందిన శివమ్మ కుటుంబ సభ్యులను పెనుకొండ టిడిపి అభ్యర్థి సవితమ్మ పరామర్శించారు.

శివమ్మ(ఫైల్‌ఫోటో)

యువకుడు ఆత్మహత్య

బత్తలపల్లి : మండలంలోని గరిశలపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. గరిశలపల్లి గ్రామానికి చెందిన అంజప్ప, బొజ్జమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె సంతానం. వారిలో ఇద్దరు కుమారులు, కుమార్తెకు వివాహం చేశారు. చిన్న కుమారుడు అనిల్‌కుమార్(25) కియాలో ఉద్యోగం చేస్తుండేవాడు. ధర్మవరం లో స్నేహితులతో కలిసి అద్దె రూంలో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి గదిలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉండగా స్నేహితులు గమనించి హుటాహుటిన అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పేకాటజూదరులు అరెస్టు

చిలమత్తూరు : మండలంలోని చేనేపల్లి గ్రామ పరిసరాల్లో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారి నుంచి రూ. 26,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

విద్యార్థులను దూషించిన ప్రిన్సిపల్‌పై ఫిర్యాదు

లేపాక్షి : స్థానిక మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు, గెస్ట్ టీచర్లు ప్రిన్సిపల్‌పై ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం ప్రిన్సిపల్ ప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులను ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడిన ఓ వీడియో సామాజిక మధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై ఎంజెపి ఎపి కళాశాల సిబ్బంది ఎబిసిడబ్ల్యుఒ కర్నూలులో ఉన్న అధికారికి ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకో వాలని విద్యార్థి, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.

ధర్మవరంలో సింబల్ మాత్రమే మారింది..!

కార్యకర్తలకు అండగా ఉంటా : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

'ధర్మవరంలో సింబల్ మాత్రమే మారింది.. మిగిలిందంతా సేమ్ టు సేమ్' అని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పొత్తులో భాగంగా ధర్మవరం టికెట్ బిజెపికి కేటాయించిన నేపథ్యంలో నిరాశలో ఉన్న పార్టీ శ్రేణుల్లో ఆయన ధైర్యం నింపి ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బిజెపి అభ్యర్థి సత్యకుమార్ ఏప్రిల్ 4వ తేదీ ధర్మవరం రానున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం ఆయన ధర్మవరం పట్టణ, రూరల్ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గం తనకు పాఠాలు నేర్పిందన్నారు. ఐదేళ్ల క్రితం శ్రీరామ్ వేరు ఇప్పుడు ఉన్న శ్రీరామ్ వేరు అన్నారు. పొత్తులో భాగంగా మనం టికెట్ త్యాగం చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎవరూ అధైర్యపడొద్దు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. కొందరు నాయకుల్లా ఓడిపోగానే పార్టీలు మారి కార్యకర్తలను వదిలేసే టైపు కాదన్నారు. బిజెపి అభ్యర్థి సత్యకుమార్ జాతీయ స్థాయి నాయకుడని, అలాంటి వ్యక్తి మన ప్రాంతానికి రావడం వల్ల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఎక్కడో జరిగిన సంఘటనలను చూసి ఇక్కడి మైనార్టీ నేతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. ఏప్రిల్ 4న సత్యకుమార్ ధర్మవరం వస్తున్నారని ఘనస్వాగతం పలుకుదామని పిలుపు నిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం

టిడిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు

ప్రజాశక్తి -పెనుకొండ

వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని హిందూపురం ఎంపి అభ్యర్థి బికె.పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. వారు శనివారం మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ గ్రామాలైన శెట్టిపల్లి, బ్రాహ్మణకాలువ, బొజ్జిరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. జగన్ మద్యపాన నిషేధం, ఉద్యోగాల భర్తీ, సిపిఎస్ రద్దు, తదితర హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీల 9 సార్లు పెంచి నిరు పేదలపై పెనుభారం వేశారన్నారు. ఉచిత ఇసుక పాలసీని రద్దు చేసి వేల కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని ఆసమర్థుడు, మోసగాడు జగన్ అని విమర్శిం చారు. మళ్లీ మన ప్రాంతానికి సాగు, తాగునీరు, పరిశ్రమలు రావాలంటే మీ రెండు ఓట్లు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, చిన్న వెంకటరాముడు, శ్రీనివాసులు, ప్రసాద్, సూర్యనారాయణ, బాబుల్‌రెడ్డి, రఘువీరచౌదరి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార రథంపై మాట్లాడుతున్న సవితమ్మ, పక్కన బికె పార్థసారథి

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-చిలమత్తూరు

రెండు నెలలుగా బిసి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పట్టించుకోని అధికారుల నిర్లక్ష్యంపై 'ప్రజాశక్తి' దినపత్రికలో శనివారం 'బిసి కాలనీలో తాగునీటి కష్టాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రామ్లా నాయక్ కాలనీలో పర్యటించి ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా నీటిని అందించారు. చెడిపోయిన నీటి బోరుకు మరమ్మతులు చేశారు. చెడిపోయిన మరిన్ని బోర్లకు మరమ్మతులు చేసి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని, లేనిచో మరోచోట బోరు వేయిస్తామని కాలనీ వాసులకు తెలిపారు. ఆయన వెంట బిల్ కలెక్టర్ మురళీధర్, తదితరులు ఉన్నారు.

ట్యాంకుతో నీరు సరఫరా చేస్తున్న అధికారులు

'ప్రజలు అధికార మార్పు కోరుకుంటున్నారు'

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

ప్రజాశక్తి-మడకశిర

ప్రజలు రాష్ట్రంలో అధికార మార్పును కోరుకుంటున్నారని కూటమి అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే ఈరన్నతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లలో ఏమాత్రం అభివృద్ధి చేయని సిఎం జగన్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏ మొహం పెట్టుకుని పర్యటిస్తున్నారో ప్రజలకు సమాధా నం చెప్పాలని డిమాండ్ చేశారు. కరువు జిల్లా ప్రజలను అదుకోవడంలో విఫలమైన వైసిపి ప్రజా ప్రతినిధులు ఓటు అడిగే నైతిక హక్కు కోల్పోయారన్నారు. జగన్ ఐదేళ్లలో 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసి నెల రోజులు కావస్తున్నా నేటికీ రైతులకు అందలేదన్నారు. టిడిపి అధికారం చేపట్టిన వెంటనే రైతులు, ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగప్ప, ఆదినారాయణ, బొజ్జప్ప, రాజగోపాల్, రామాంజనేయులు, రమేష్, నరేష్, కోట్ల రంగనాథ, నాగరాజు పాల్గొన్నారు.

మహిళలతో ముఖాముఖిలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్, ఈరన్న

మహిళలతో ముఖాముఖి

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ మహిళలతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసి టిడిపి మినీమేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మహిళలు మాట్లాడుతూ సునీల్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ఖచ్చితంగా మడకశిర అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఆదినారాయణ, కోట్ల రంగనాథ్, రాజగోపాల్, బాబు, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బత్తలపల్లి గ్రామంలో సీతారాము, లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శనివారం ధ్వజస్తంభ స్థాపన, సీతారాముల, లక్ష్మణ, సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్టిం చారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కొండమరాజు, లాయర్ హరికృష్ణ, పెడపల్లి డాక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారు. వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. యువత జైశ్రీరామ్ అంటూ గ్రామంలో సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రతిష్టించిన సీతారాముల విగ్రహాలు

చౌడేశ్వరి ఆలయంలో ఘనంగా పునఃప్రతిష్టాపన

లేపాక్షి : మండలంలోని చోళసముద్రం గ్రామంలో వెలసిన పురాతన చౌడేశ్వరీ ఆలయంలో శనివారం లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ రమానంద ఆధ్వర్యంలో పునఃప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రమానంద మాట్లాడుతూ 500 ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. పేదలు, వికలాంగులు, ఆర్థిక స్తోమత లేని వారికి అందుబాటులో ఉంటూ తన వంతుగా సాయం చేస్తానని తెలిపారు.

లేపాక్షి మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

వైసిపి అభ్యర్థి దీపిక ప్రచారం

లేపాక్షి : ప్రజలకు అందుబాటులో ఉంటా ఆశీర్వదించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక కోరారు. ఆమె శనివారం మండలంలోని నాయనపల్లి పంచాయతీ ఉప్పరపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానిక నాయకులతో కలిసి గడప గడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా సిఎం జగన్ సేవ చేశారని, మరోమారు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ స్వామి, నాయకురాలు మధుమతి, నీలావతి, వేణురెడ్డి, తిప్పన్న, చలపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ తమ్మినాయనపల్లిలో దీపిక ఇంటింటికీ వెళ్లి కరపత్రం అందజేసి ఓట్లు అభ్యర్థించారు. గ్రామానికి రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. ఆమె వెంట ఎంపిపి పురుషోత్తమరెడ్డి, సీనియర్ నాయకులు నాగరాజు, కన్వీనర్ రాజారెడ్డి, సర్పంచి ఈడిగ తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి సన్మానం

హిందూపురం : హైకోర్టు న్యాయమూర్తి, అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావును హిందూపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం అనంతపురంలో అతిథి గృహంలో కలిసి సన్మానించారు. కొంతకాలంగా హిందూపురం కోర్టులో నెలకొన్న సమస్యలపై స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది సిద్దు ఆయనకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన ఆయా సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటానని పేర్కొన్నట్లు వారు తెలిపారు.

న్యాయమూర్తిని సన్మానిస్తున్న పురం బార్ అసోసియేషన్‌న్యాయవాదులు

రథోత్సవంలో భక్తజనం మధ్య ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

శ్రీవారి మడుగు తేరు లాగిన ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన బ్రహ్మరథోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఆయన ముందుగా శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మడుగుతేరును లాగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏటా తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటారన్నారు.

1 నుంచి పాలిసెట్ శిక్షణ

హిందూపురం : పదో తరగతి పరీక్షలు రాసి, పాలిసెట్-2024కు రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు పట్టణ సమీపం లోని బి.ఐ.టి(బిట్) ఇంజినీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. వివరాలకు 80088 40151, 85009 88114 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణ తెలిపారు. శిక్షణ కుటాగుళ్ల పాలిటెక్నిక్ కదిరి కళాశాలలో ఇస్తామని, హాజరైన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇస్తామన్నారు. వివరాలకు 90102 22175 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

హిందూపురం : పట్టణంలోని త్యాగరాజ కాలనీలో స్థానిక ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద స్టాఫ్ క్లబ్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు తమ వంతు బాధ్యతగా కళాశాల వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశామని ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటేసులు, అధ్యాపకులు డాక్టర్ యశోద, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రవినాయక్, సుమంగళి, ప్రకాష్‌రావు, అశ్వర్థప్ప, ఖుష్నుమా, బాలిరెడ్డి పాల్గొన్నారు.

'పురం'లో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలు పురస్కరించుకొని పట్టణంలోని సిఅండ్ఐజి మిషన్ కాంపౌండ్ చర్చి ఆధ్వర్యంలో ఆరాధన టీవీ సౌజన్యంతో హిందూపురం పాస్టర్ ఫెలోషిప్‌ల సహకారంతో శనివారం పట్టణ ప్రధాన రహదారుల్లో శాంతి ర్యాలీ చేపట్టారు. సంఘ పాస్టర్ రెవరెండ్ స్టీఫెన్ రాజ్, సెక్రటరీ డాక్టర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి నెలకొనాలని, దేశం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ శాంతి ర్యాలీ చేపట్టామన్నారు. ర్యాలీలో మనోజ్ తాగునీటిని అందించారు. కార్యక్రమంలో హిందూపూర్ పాస్టర్ ఫెలోషిప్ పెద్దలు, రెవరెండ్ ఎన్.డేవిడ్, రెవరెండ్ ఇస్రాయిల్ రాజ్, రెవరెండ్ ఎస్.సూర్యప్రకాష్, లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్, చైతన్య గంగిరెడ్డి, రెవరెండ్ సాంబశివరావు, సంఘ డీకెన్ సభ్యులు ఆనంద్‌రాజ్, సాల్మన్‌రాజ్, జార్జిబాబు, రెవరెండ్ ఎం.దేవరాజ్, రెవరెండ్ కిరణ్, ఐజక్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ నాగేంద్ర కుమార్

వైసిపిలో పలువురు చేరిక

పుట్టపర్తి అర్బన్ : వైసిపి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు టిడిపి నాయకులు వైసిపిలో చేరుతున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్‌కు చెందిన 50 మైనార్టీ కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిని వీడి వైసిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే వైసిపి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చాంద్‌బాషా, ముస్తాక్, ఫయాజ్, రిజ్వాన్, షబ్బీర్, సురేష్, నరసింహులు, శంకర్ ఉన్నారు.



వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

కదిరి టౌన్ : ఎన్‌పి కుంట మండలం లోని మండెంవారిపల్లికి చెందిన పలువురు టిడిపి నాయకులు శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ సమక్షంలో వైసిపిలోకి చేరారు. వారికి మక్బూల్ వైసిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు. ఎన్నికల్లో ఎన్‌పి కుంట మండలంలో వైసిపికి అత్యధిక మెజారిటీ సాధిస్తామన్నారు. కార్యక్ర మంలో సింగిల్‌విండో అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, ఎంపిటిసి షామీర్, సర్పంచి శ్రీరాములు, నాయకులు శ్రీహరి, శివకుమార్, ఫకృద్దీన్, అస్లాం, హరి, కె.నాగార్జుననాయుడు, ఏలేటి శ్రీనివాసులు పాల్గొన్నారు.


కదిరిలో వైసిపిలో చేరిన వారితో మక్బూల్‌అహ్మద్

బైరాపురంలో వైసిపి ప్రచారం

కొత్తచెరువు రూరల్ : మండలంలోని బైరాపురం గ్రామపంచాయతీ బైరాపురం, సాయి నగర్, ఓబుళదేవరపల్లి గ్రామా ల్లో శనివారం వైసిపి నాయకులు అవుటాల రమణారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డిని, ఎంపిగా శాంతమ్మను గెలిపించాలని కోరారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అందజేసని సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామచంద్ర, పోతన్న, చెన్నకేశవులు, వీరప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

హిందూపురం : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ఉమెన్స్ కళాశాలలో 1986-90 బ్యాచ్ విద్యార్థినులు శనివారం కళాశాలలో ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారి వారి కుటుంబాల పరిస్థితులు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 33 ఏళ్ల తర్వాత తోటి విద్యార్థులను, అప్పటి అధ్యాపకులను కలుసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అప్పటి అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరీష్‌బాబు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కూటమిదే విజయం

పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

పెనుకొండ : రాబోయే ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధిస్తుందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివా రం సవితమ్మ విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు చాలా కష్టాలు పడ్డారని, దీంతో వ్యవస్థలో మార్పు, విధానాల్లో మార్పును కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని, 1వ తేదీ జీతాలు అందడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు, పెన్షన్‌దారులకు 1వ తారీఖున పెన్షన్ అందుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసమే టీడీపీ, బీజేపీ, జనసేన కలిశాయన్నారు. అన్నా క్యాంటీన్లను తెరుస్తామన్నారు. నాసిరకం మద్యాన్ని నిర్మూలిస్తామన్నారు. వైసిపికి వ్యతిరేకంగా చేస్తున్న ఈ పోరాటంలో మనతో కలిసి వచ్చే ప్రజల గొంతుకే ప్రజాగళం అన్నారు.

పొలిటికల్ హీట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మార్చి ఆఖరు రావడంతో వాతావరణం బాగా వెడెక్కింది. 40 డిగ్రీలకుపైగా ఎండ వేడిమి చేరుకుంది. ఈ వేడిమికి సామాన్య జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇదే సమయంలో ఎన్నికలు రావడంతో పొలిటికల్ హీట్ కూడా తోడైంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రచారాలు పెరుగుతున్నాయి. ఈ వారంలో రెండు ప్రధాన పార్టీల నాయకులు జిల్లాలో పర్యటిం చారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ప్రజాగళం పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రాప్తాడు, శింగనమల, కదిరి నియోజకవర్గాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శింగనమల నియోజకవర్గం పరిధిలో వైసిపి అభ్యర్థి వీరాంజినేయులు టిప్పర్ డ్రైవరంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి. దళితుడని చిన్నచూపు చూస్తున్నారంటూ వైసిపి నాయకులు మండిపడ్డారు. అది ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇదే సమయంలో సిఎం జగన్ మేమంతా సిద్ధం యాత్ర జిల్లాకు చేరుకుంది. ఈ యాత్ర గుత్తిలో ప్రారంభమై శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లో కొనసాగింది. ఆదివారం కూడా యాత్ర కొనసాగనుంది. సుమారు ఆరు నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నారు. ఆయన ప్రతిపక్ష టిడిపిపై విమర్శలు ఎక్కుపెట్టారు. అంతేకాకుండా యాత్ర సమయంలో అక్కడక్కడ నేతలను పార్టీలో చేర్చుకునే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే కళ్యాణదుర్గం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ యాత్ర పూర్తయ్యేలోపు మరింత మంది చేరే సూచనలు కనిపిస్తున్నాయి. ఇలా జిల్లాలో అధికార, ప్రతిపక్ష పార్టీల ముఖ్యనేతల పర్యటనల సందర్భంగా చేసుకుంటున్న విమర్శలు, ప్రతి విమర్శలు రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. ఈలోపు టిడిపి అభ్యర్థుల తుదిజాబితా విడుదల చేసింది. ఆ పార్టీలో నిరసన జ్వాలాలు ఎగిసిపడుతున్నాయి. అనంతపురం అర్బన్ స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరిని కాదని దగ్గుపాటి వెంకట ప్రసాద్‌కు కేటాయించారు. దీనిపై ప్రభాకర్‌చౌదరి వర్గీయులు ఆందోళన బాటపట్టారు. టిడిపి కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. గుంతకల్లులోనూ జితేందర్‌గౌడ్ వర్గీయులు కార్యాలయంపై దాడి చేశారు. దీంతో టిడిపిలో గ్రూపు తగాదాలు తారాస్థాయికి చేరుకున్నట్లు అయింది. ఈ సమయంలో ప్రజా సమస్యలేవి చర్చకు రాకుండాపోతున్నాయి. ఇకపోతే కలెక్టరేట్ ఎదుట ఒక మహిళ ఆకలిచావుతో చనిపోయిందన్న వార్త పతాక స్థాయిలో వచ్చింది. అయితే అధికారులు ఇది ఆకలిచావు కాదు... భర్త కొట్టడంతో చనిపోయిందని కేసు నమోదు చేశారు. పిల్లలకు ఎలాంటి గుర్తింపు కార్డుల్లేక ప్రభుత్వ పథకాలేవీ అందుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. వీరికి ఆధార్ కార్డు అందజేసి ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని అధికారులు చెబుతున్నారు. వేసవిలో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. దీనికోసం అధికార యంత్రాంగం ప్రత్యేకమైన సెల్‌ను ఏర్పాటు చేసింది. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులొచ్చిన వెంటనే తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇలా ఈవారంలో రాజకీయ వాతావరణం మరింత వేడిక్కెందనే చెప్పాలి. రాబోయే రోజుల్లో ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ వేడి మరింత పెరిగే సూచనలూ కనిపిస్తున్నాయి.